
విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

నాణ్యమైన విద్యాబోధన అందించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్
» ప్రజావాణిలో 147 దరఖాస్తుల స్వీకరణ

వికారాబాద్/మోమిన్‌పేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యాపకులను అధికారులను ఆదేశించారు. సోమవారం వికారాబాద్, మోమిన్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి సిలబస్ ఎంత వరకు పూర్తి అయిందని అడిగి తెలుసుకున్నారు. అలాగే లెక్చరర్స్‌కు సంబంధించిన హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. కళాశాలలో పెండింగ్ పనులు ఉంటే త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం మోమినన్‌పట్ పశువైద్యశాలను సందర్శించిన కలెక్టర్ అక్కడ వైద్య సిబ్బందితో మాట్లాడారు. పశువులకు సోకే వ్యాధులకు మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. పశువైద్య శాలలలో బయోమెట్రిక్ కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్షచౌదరి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎన్.శంకర్ నాయక్, వికారాబాద్ ఎంపీడీఓ వినయ్ కుమార్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, మోమిన్‌పేట ఎంపీడీఓ విజయలక్ష్మి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, ఆశీర్వాదం, ఎంపీవో యాదగిరి, ఆర్ఐ సురేశ్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు స్వప్న, ప్రవీణ్‌కుమార్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 147 దరఖాస్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటిప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, వివిధ శాఖల అధికారులు, సెక్షన్ సూపరింటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో కొందరు కార్యదర్శులు తమ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. విధి నిర్వహణలోనూ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. విధులకు హాజరైనా.. కాకపోయినా ఎవరు చూస్తారనే ధీమాతో ఉన్నారు. అంతటితో సరిపెట్టుకోకుండా మరో అడుగు ముందుకేసి ఏకంగా అక్రమంగా హాజరు వేసుకుంటుండటం గమనార్హం. విధులకు హాజరు కాకపోయినా పాత ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసి హాజరు వేసుకుంటున్నారు. కాగా, వికారాబాద్ జిల్లాలో 63 మంది పంచాయతీ కార్యదర్శులు అక్రమంగా హాజరు వేసుకున్నట్లు ఉన్నతాధికారుల తనిఖీల్లో తేలింది.



హాజరుపై నజర్


విధులకు హాజరైనట్లు పాత ఫొటోల అప్‌లోడ్
ఉన్నతాధికారుల తనిఖీల్లో వెలుగులోకి..
జిల్లాలో 63 మంది సెక్రెటరీలకు నోటీసులు
9 మండలాల పంచాయతీ అధికారులకూ..
మొత్తం 594 గ్రామ పంచాయతీలు
విధుల్లో 534 పంచాయతీ కార్యదర్శులు

వెలుగులోకి పంచాయతీ కార్యదర్శుల అక్రమాలు

నకిలీ హాజరు నమోదు చేసిన కార్యదర్శులు

మండలం	కార్యదర్శుల సంఖ్య	మండలం	కార్యదర్శుల సంఖ్య
కొడంగల్	7	నవాబ్‌పేట్	2
బషీరాబాద్	6	పూడూరు	2
పెద్దేముల్	6	తాండూరు	2
ధారూరు	5	దోమ	2
పరిగి	5	దౌల్తాబాద్	2
వికారాబాద్	4	కోట్‌పల్లి	2
చౌడాపూర్	4	కులకచర్ల	2
దుద్యాల	4	యాలాల	1
మోమిన్‌పేట్	4	మర్పల్లి	1
		బంట్వారం	1
		బొంరాస్‌పేట్	1

వికారాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విధులకు హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు ఏరోజుకారోజు తాము పనిచేసే పంచాయతీ కార్యాలయం వద్ద తాజా ఫొటోను డీఎస్ఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేసి తమ హాజరును నమోదు చేసుకోవాలి. కానీ, కొందరు పాత ఫొటోలు, ఇతర ఫొటోలు అప్‌లోడ్ చేస్తూ అక్రమంగా హాజరును నమోదు చేసుకుంటున్నారు. వారి హాజరు తీరును రోజువారీగా సంబంధిత అధికారులు సమీక్షించాల్సి ఉన్నా ఆ విధంగా జరగకపోవడంతో అక్కడక్కడా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల పంచాయతీ కార్యదర్శుల హాజరు తీరును రాష్ట్ర కార్యాలయంలో సమీక్షించిన ఉన్నతాధికారులు కొందరు విధులకు హాజరు కాకున్నా హాజరు నమోదు చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఈ విషయమై సమగ్రంగా విచారణ జరపడంతో వారి అక్రమ లీలలు వెలుగులోకి వచ్చాయి. జగిత్యాల జిల్లాలో ఓ పంచాయతీ కార్యదర్శి ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను అప్‌లోడ్ చేయగా, వికారాబాద్ జిల్లాలో 63 మంది పంచాయతీ కార్యదర్శులు అక్రమంగా హాజరు వేసుకున్నట్లు ఉన్నతాధికారుల తనిఖీల్లో తేలింది.



జిల్లాలో 594 పంచాయతీలు ఉండగా, 534 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. వారు రోజూ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఉదయం ముఖ ఆధారిత (ఫేస్ రికగ్నిషన్) హాజరు నమోదు చేసుకోవాలి. కొందరు విధులకు గైర్హాజరైనా.. హాజరైనట్లు నమోదు చేసుకున్నారు. అక్రమంగా హాజరు నమోదు చేసుకున్న వారిలో జిల్లాకు చెందిన 63 పంచాయతీ కార్యదర్శులు ఉన్నట్లు తేల్చారు. హాజరు నమోదులో

మిగతా 8వ పేజీలో...

నీలకంఠేశ్వరుడిగా శివయ్య

తాండూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తాండూరు భావిగి భద్రేశ్వర ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయంలోని శివుడిని ప్రత్యేకంగా అలకరించారు. అర్చకుడు విజయ్‌కుమార్ కర్ణాటక రాష్ట్రం కాళిగి పట్టణంలో వెలిసిన నీలకంఠేశ్వర స్వామి అలంకరణలో అలంకరించారు.

నేడు బీఆర్ఎస్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం

మేడ్చల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : బీఆర్ఎస్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని గండిమైసమ్మలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టుపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు వివరించడంపై ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నాయకులు ఈ సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో తాండూరువాసుల సత్తా



తాండూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీల్లో తాండూరు, వికారాబాద్ క్రీడాకారులు సత్తా చాటారు. ఆదివారం రాత్రి జింఖానా గ్రౌండ్‌లో జరిగిన స్పోర్ట్స్ అండ్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటిన వారికి అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవేందర్‌రెడ్డి పతకాలను అందజేశారు. తాండూరుకు చెందిన మెట్ల ఆశన్న 100మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో మూడోస్థానం సాధించారు.వీసీ జి.శ్రీనివాస్, క్రీడాకారిణి సంతోష సైతం పతకాలు సాధించారు.


కేశంపేటలో ఇళ్లలోకి చేరిన వరద నీరు

శివార్లలో కుండపోత

గ్రామీణ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో అత్యధికంగా 151.5 మి.మీ వర్షపాతం

జలమయమైన లోతట్టు ప్రాంతాలు
రంగారెడ్డి జిల్లా కేశంపేటలో 91.3 మి.మీ వర్షపాతం
అయినా పలు మండలాల్లో లోటు వర్షపాతమే
ఉమ్మడి జిల్లాకు మరో నాలుగైదు రోజుల వర్షసూచన

నగర శివారు ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురిసింది. మేడ్చల్, రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు మండలాల్లో సోమవారం సాయంత్రం ఏకధాటిగా రెండుగంటల పాటు భారీ వర్షం కురిసింది. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో రికార్డు స్థాయిలో 151.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే శివార్లలోని అనేక మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. రోడ్లన్నీ జలమయమైయ్యాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. డ్రైనేజీల్లో నీళ్లు పొంగడంతో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరో వైపు గ్రామీణ ప్రాంతాల్లోనూ వర్షం కురవడంతో రైతులు సంతోషపడుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): గత రెండు వారాలుగా ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న వర్షాలు పంటలకు ఊపిరి పోస్తున్నాయి. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న పంటలు వేసిన రైతులు ఊరట చెందుతున్నారు. మరో వైపు ఇప్పటి వరకు పంటలు వేయలేకపోయిన వారు విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే వరి నాట్లు వేసేందుకు కూడా రైతులు సిద్ధమవుతున్నారు. మరో నాలుగైదు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ పేర్కొవడంతో ఉమ్మడి జిల్లాలో సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే సోమవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని రాజీవ్ గృహకల్పలో 102.0మి.మీ, బస్తీదవాఖాన పరిధిలో 100.8 మి.మీ, బాలానగర్ మండలం హైదర్‌నగర్‌లో 85మి.మీ, శంషీగూడలో 81.5మి.మీ, గాజులరామారం, ఆదర్శనగర్‌లో 75.8 మి.మీ, బాచుపల్లిలో 62.5మి.మీ, ఈఎస్ఐ, జీడిమెట్లలో 59.0మి.మీ, ఉప్పల్‌లో 43.0మి.మీ వర్షపాతం

మిగతా 7వ పేజీలో...

మెరుగైన వైద్య సేవలు అందించాలి

» మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి
» ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి తనిఖీ


బాలుడికి జ్వరాన్ని చూస్తున్న కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ ఘట్‌కేసర్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం ఆయన ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిని పరిశీలించిన ఆయన రోగులను, వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు మందులను ఇచ్చే ముందు ఎక్స్‌పైరీ తేదీని చూసి ఇవ్వాలన్నారు. వైద్య పరీక్షలకు రాని గర్భిణిలను గుర్తించి ఆశ వర్కర్ల ద్వారా వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలని ఆదేశించారు. ప్రతీ నెల ఎన్ని సర్జరీలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. పిల్లల వార్డుకు వెళ్లి అక్కడున్న చిన్నారులతో మాట్లాడారు. జ్వరం తగ్గిపోతుంది లే అంటూ చిన్నారుల నుదిటిపై చేయిపెట్టి జ్వరాన్ని పరిశీలించారు. అనంతరం మందుల రిజిస్టర్ పరిశీలించి అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా? అని అడిగి తెసుకున్నారు. అనంతరం ల్యాబరేటరీ, ఎక్స్‌రే గదిని పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలటూ వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్‌రెడ్డితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసాలకోర్చి వారి సమస్యలను పరిష్కారిస్తామనే నమ్మకంతో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాగా, ప్రజావాణిలో 91 దరఖాస్తులు స్వీకరించారు.



సహకార వ్యవస్థ బలోపేతం

ఒకే గొడుగు కిందికి
వివిధ సొసైటీలు
పాత పద్ధతిలో నిర్వహణ
కొత్త బ్రాంచీల ఏర్పాటుకు ప్రతిపాదన

7

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మీపండిత్

పరిగి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీపండిత్ డిమాండ్ చేశారు. సోమవారం పరిగిలో జరిగిన సీపీఐ మండల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పేదల పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేస్తామని తెలిపారు. అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలతో పాటు రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అలాగే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌కు నిధులు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి పీర్‌మహ్మద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేశ్ కుమార్, ఎం.వెంకటేశ్, చంద్రయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు. అలాగే పరిగి మండల సీపీఐ కార్యదర్శిగా ఎం.వెంకటయ్య, సభ్యులు రాంచంద్రయ్య, యాదయ్య, చంద్రయ్య, మల్లయ్య, జంగయ్య, నజీర్, గఫార్‌లను ఎన్నుకున్నారు.

మెడికల్ క్యాంప్ విజయవంతం

» 380 మంది హాజరు.. 60మందికి సర్జరీల సిఫార్సు
» ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు


రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రోగులు

తాండూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తాండూరులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) ఆవరణలో సోమవారం నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌నకు విశేష స్పందన లభించింది. ప్రత్యేక వైద్య నిపుణులు రోగులను పరిక్షించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో లలితాదేవి ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యూపీహెచ్‌సీ కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ మాలశ్రీ ఆధ్వర్యంలో ఈ క్యాంపు కొనసాగింది. తాండూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల రోగులు, మున్సిపల్ కార్మికులు, కంపెనీలలో పని చేసే కార్మికులు హాజరయ్యారు. మొత్తం 380 మంది పరీక్షలు చేయించుకోగా 62 మందికి పలు ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్ యాదవ్ తెలిపారు. ఇందులో 108 మందికి చెవి, 152 మందికి కంటి, 11 మంది మానసిక సమస్యలు, 110 మంది పలు రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని వివరించారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. దాదాపు 4 గంటల పాటు ప్రత్యేక వైద్యులు రోగులను పరిశీలించారు. కార్యక్రమంలో శిబిర ఇన్‌చార్జి డాక్టర్ అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

» ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విలాసరావు
» సీసీఐ గేట్ ఎదుట కార్మికులతో కలిసి ఆందోళన


తొలగించిన కార్మికులతో కలిసి ఆందోళన చేస్తున్న విలాసరావు

తాండూరు రూరల్ : ఆగస్టు 4, (ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్ ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారంలో ప్యాకింగ్ ప్లాంట్‌లో పనిచేసే 97 మంది కార్మికులను అకస్మాత్తుగా తొలగించడం దుర్మార్గమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విలాసరావు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు కరన్‌కోట్ సీసీఐ మెయిన్ గేట్ ఎదుట తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులు, గ్రామ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సీసీఐ యాజమాన్యం వెంటనే కాంట్రాక్టర్‌ను పిలిచి చర్చలు జరిపి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా 97మందిని అక్రమంగా తొలగించడంతో వారి కుటుంబాలన్నీ వీధుల్లో పడ్డాయని యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు బాల్‌రాజ్, మాజీ ఎంపీపీ శరణు బసప్ప, మాజీ ఎంపీటీసీ మైలారం రాజ్ కుమార్, ఏఐటీయూసీ కార్మిక నాయకులు దప్పస్తప్ప, తాహేర్ పాషా, మోహన్, కాశీ, ఆనంద్, నరేశ్, జర్నప్ప తదితరులున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ఆమనగల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని శారీరకంగా వాడుకొని మోసగించిన ఆమనగల్లుకు చెందిన ఎనుముల వెంకటేశ్‌కు 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ షాద్‌నగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పును ఇచ్చారని ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో ఆమనగల్లుకు చెందిన బాలికను పట్టణానికి చెందిన వెంకటేశ్(34) ప్రేమ పేరుతో సన్నిహితంగా మెదలి మోసగించాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. షాద్‌నగర్ పోక్సో కోర్టు విచారణ చేసింది. నిందితుడు నేరం చేశాడని రుజువు కావడంతో అతడికి 20ఏళ్ల జైలు శిక్ష విధించారని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ కేసు సాక్ష్యాలు ప్రవేశపెట్టడంలో అప్పటి సీఐ ఉపేందర్, ఏసీపీ కుషాల్కర్, ఎస్‌హెచ్‌వో వెంకటేశ్, కోర్టు కానిస్టేబుల్ యాదయ్య, పీసీ జగన్‌లు ముఖ్యపాత్ర పోషించారని ఎస్ఐ పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

కొత్తూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని సిద్ధాపూర్‌లో దాతల సహకారంతో రూ.20లక్షలతో నిర్మించిన ఇప్పలగడ్డ మైసమ్మ ఆలయంలో సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. మూడు రోజులుగా పూజా, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సాయంత్రం గ్రామ మహిళలు బోనాలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, అంబటి ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ రాసుల జంగయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, పాషా, మల్లేష్, వెంకటయ్య, కుమార్, గోపాల్, నరేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం పెట్టలేదని..

- హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్, చార్జిమెమో
- ఎంఈవోకు షోకాజ్ నోటీస్ జారీ

పెద్దేముల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టలేదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి డీఈవో షోకాజ్ నోటీస్, చార్జిమెమో, ఎంఈవోకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తింసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 12మంది విద్యార్థులే ఉన్నారు. గతేడాది భోజనం వండిన మహిళ కేవలం 12మంది విద్యార్థులకు వంట చేస్తే తనకు గిట్టుబాటు కాదని మానుకుంది. ఈ సారి విద్యార్థులకు భోజనం వండిపెట్టేందుకు గ్రామంలో ఎవరూ ముందుకు రాలేదు. విషయం తెలిసిన కలెక్టర్ తింసాన్‌పల్లి పాఠశాలను సందర్శించాలని డీఈవోను ఆదేశించారు. ఈ నెల 2న డీఈవో రేణుకాదేవి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు భోజనం వడ్డించడం లేదని నిర్ధారించారు. అదేరోజు భోజనం వండేందుకు వంట ఏజెన్సీని నియమించి విద్యార్థులకు భోజనం పెట్టించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశానుసారం సోమవారం హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు, చార్జిమెమో, ఎంఈవోకు షోకాజ్‌నోటీస్ జారీ చేశారు. పిల్లలకు భోజనం ఎందుకు పెట్టించలేదని వివరణ కోరారు. కాగా జిల్లాలోని ఏ పాఠశాలలోనైనా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో హెచ్చరించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బాలాజీసింగ్



ఆమనగల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్ సోమవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉన్నత చదువు కోసం ఆమెరికా వెళ్తున్న బాలాజీసింగ్ కుమారుడు ఠాకూర్‌ప్రణవ్‌గోపాల్ సింగ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆశీర్వదించి అభినందించారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ సరోజారెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని చవాన్ ఫంక్షన్ హాల్‌లో గత నెల 27నుంచి నెల 3 వరకు జరిగిన సీనియర్ ఖేలో ఇండియా ఉషూ ఉమెన్స్ లీగ్ 2025 పోటీల్లో పీటర్స్ ఇంజినీరింగు కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఉషూ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పీటర్ కళాశాలకు చెందిన హరిణి(సిల్వర్), కె.రామేశ్వరి(సిల్వర్), బి.సాయివర్షిని(బ్రాంజ్), ఎస్.సౌజన్య(సిల్వర్), టి.మహేశ్వరి(సిల్వర్) మెడల్స్ సాధించారు. సోమవారం కళాశాల డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి,అధ్యాపకులు, తోటి విద్యార్థులు పతకాలు సాధించిన వారిని అభినందించారు.

డివిడెండ్‌ను మంజూరు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, మహిళలు

కీసర రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపల్ పరిధి మహిళా సంఘాల సభ్యులకు రావాల్సిన డివిడెండ్ ఫండ్‌ను మంజూరు చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. మున్సిపాలిటీకి చెందిన మహిళా సంఘాలను 2018 వరకు కీసరలోని స్నేహ సొసైటీలో కొనసాగించి మున్సిపల్ ఏరియాలోని బ్యాంకుల్లో లావాదేవీలు కొనసాగించామని చెప్పారు. 2018 వరకు మహిళా సొసైటీలో వచ్చిన లాభాలను సభ్యులకు ఇవ్వలేదన్నారు. లాభాల్లో డివిడెండ్‌ను వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, నరేష్, రవీందర్ రెడ్డి, జ్యోతిపాండే, కృష్ణవేణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సర్వేయర్లకు కొనసాగుతున్న శిక్షణ



ట్రైనీ సర్వేయర్లకు సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

కోట్‌పల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): భూ సర్వేయర్లకు శిక్షణ ఇస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. 50రోజులుగా వికారాబాద్‌లో సీనియర్ సర్వేయర్లతో ట్రైనింగ్ పొందిన వారు సోమవారం నుంచి మండల సర్వేయర్లతో 40రోజులు శిక్షణ పొందుతారని తెలిపారు. మొత్తం 11 మందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎండీ.యూనుస్, ఆర్ఐ భాగ్యలక్ష్మి, సర్వేయర్ సాయికిరణ్, సిబ్బంది జగదీష్, బాల్‌రాజ్, ట్రైనీలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం



చేవెళ్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి సాయం అందించడం సంతోషంగా ఉందని ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం తన జన్మదినాన్ని పురస్కరించుకొని దేవరంపల్లిలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి రూ.2,01,000, అలాగే తంగడ్‌పల్లిలోని అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి రూ.51వేలు, న్యాలటలో సువార్త సంఘం భవన నిర్మాణానికి రూ.1.6లక్షల విరాళం అందజేశారు. గ్రామస్తులు, నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డిని అభినందించారు.

బీసీ రిజర్వేషన్లు ఆమోదించే వరకూ ఉద్యమం

వికారాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 42శాతం బీసీ రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం ఆమోదించే వరకూ ఉద్యమం ఆగదని కాంగ్రెస్ వికారాబాద్ నియోజకవర్గ బీసీ నాయకులు అన్నారు. సోమవారం ఢిల్లీకి బయల్దేరిన వారు మాట్లాడుతూ.. ఢిల్లీలో 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో తలపెట్టిన ధర్నాకు వెళ్తున్నట్లు తెలిపారు. ఢిల్లీ వెళ్లిన వారిలో శ్రీనివాస్, వెంకట్, ఎం.శ్రీనివాస్, గోవర్ధన్, శివయ్య, అజీమ్, వెంకటయ్యగౌడ్ ఉన్నారు.



మాట్లాడుతున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

లక్ష మందికి వైద్య పరీక్షలు

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి వెల్లడి

ఆమనగల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గ ప్రజల సంపూర్ణారోగ్యమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష మందికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. మొబైల్ క్లినిక్‌ల ద్వారా వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఆమనగల్లులోని ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం వన్‌మెడి సంస్థతో కలిసి వైద్య శిబిరాల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇందుకు రూపొందించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను రాఘవేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో 2028 వరకు కొనసాగే వైద్య శిబిరాలను ఈ నెల 6న ఆమనగల్లు మండలం మేడిగడ్డలో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రతీ వారం ఒక గ్రామంలో ఇంటింటికి తిరిగి వన్‌మెడి బస్సు ద్వారా ప్రజలకు గుండె, లివర్, కిడ్నీ, మధుమేహ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. ఇప్పటికే 426 మందికి కంటి ఆపరేషన్లు, 8,256 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. నిరుద్యోగులకు ఫౌండేషన్ ద్వారా నైపుణ్యశిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, ఫౌండేషన్ సభ్యులు మండ్లి రాములు, రచ్చ శ్రీరాములు, మల్లేశ్‌నాయక్, అభినవ్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, కొండల్, జైపాల్‌రెడ్డి, శివ, దళపతిగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పురుషోత్తంరావు

రాజ్యాధికారమే లక్ష్యం

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరావు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారమే లక్ష్యంగా, కుల సంఘం ఎన్నికలతో మున్నూరు కాపుల ప్రతిష్ఠ పెరిగిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరావు అన్నారు. సోమవారం మండలంలోని బుక్క వేణుగోపాల్ ఫామ్‌హౌస్‌లో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపులు హక్కుల సాధనకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపు సంఘానికి ఎన్నికలు నిర్వహించడం అద్భుతన్నారు. ఇటీవల వేములవాడలో 400 కార్లతో ర్యాలీ నిర్వహించి ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించడంతో మున్నూరు కాపుల ప్రతిష్ఠ పెరిగిందన్నారు. అపెక్స్ కమిటీ సభ్యుడు మీసాల చంద్రయ్య మాట్లాడుతూ.. మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రం పేరుతో 'ఒకే కులం-ఒకే సంఘం'గా ఉండాలని కొండ దేవయ్యను అధ్యక్షుడిగా నియమిస్తే ఆయన ఒంటెద్దు పోకడలతో విసిగిపోయామన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు బండి పద్మ మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు దూరప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు హాస్టల్ వసతిని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అపెక్స్ కమిటీ సభ్యులు రౌతు కనకయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంటయ్య, కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నాటేందుకు 50వేల మొక్కలు సిద్ధం



నర్సరీని పరిశీలిస్తున్న కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వనమహోత్సవంలో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీలో ఇంటింటికీ పంపిణీ చేయడానికి 50వేల మొక్కలు సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ అన్నారు. హరిత ఆమనగల్లు లక్ష్యంగా ప్రతి ఇంటికి ఆరు మొక్కలు ఈ నెల 7 నుంచి పంపిణీ చేస్తామన్నారు. సోమవారం పట్టణంలోని నర్సరీని పరిశీలించారు. పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.

శివార్లలో కుండపోత

(ఐదో పేజీ తరువాయి)

నమోదైంది. కాప్రాలో 42.0మి.మీ., షాపూర్ నగర్‌లో 38.0మి.మీ., కాప్రా జీహెచ్‌ఎంసీ ఆఫీస్ వద్ద 35.8మి.మీ., వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా కేశంపేటలో అత్యధికంగా 91.3మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లో 79.5మి.మీ., శాస్త్రీపురంలో 65.8మి.మీ., ఆమనగల్లులో 57.3మి.మీ., మైలార్‌దేవ్‌పల్లిలో 42.3మి.మీ., మొయినాబాద్ మండలం చిలుకూరు మృగవనిలో 34మి.మీ వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాపోల్‌లో 44.3మి.మీ., దౌల్తాబాద్‌లో 29.0 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

అయినా లోటు వర్షపాతమే

గడిచిన రెండు వారాలుగా ఉమ్మడి జిల్లాలో వర్షాలు కురుస్తున్నప్పటికీ పలు మండలాల్లో ఇంకా లోటు వర్షపాతమే ఉంది. ఈ సీజన్‌లో రంగారెడ్డి జిల్లాలో సగటు కంటే 14శాతం అధికంగా వర్షపాతం నమోదు కాగా వికారాబాద్ జిల్లాలో రెండు శాతం అధిక వర్షపాతం కురిసింది. మేడ్చల్ జిల్లా పరిధిలో పలు చోట్ల సోమవారం భారీ వర్షాలు కురిసినప్పటికీ ఇంకా 21 శాతం లోటు ఉంది. అనేక మండలాల్లో ఇప్పటికే అంతంత మాత్రంగానే వర్షాలు పడ్డాయి. రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ మండలంలో 53శాతం లోటు వర్షపాతం నమోదైంది. అలాగే మాడ్గుల మండలంలో 51 శాతం, ఫరూఖ్‌నగర్‌లో 38శాతం, చేవెళ్లలో 35 శాతం, తలకొండపల్లిలో 34 శాతం, యాచారంలో 33 శాతం, గండిపేటలో 32 శాతం, మంచాలలో 31 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా మర్పల్లి, దోమ, బంట్వారం మండలాల్లో 40శాతం, దౌల్తాబాద్‌లో 34శాతం తక్కువ వర్షం కురిసింది. మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లి మండలంలో 43శాతం, దుండిగల్‌లో 37 శాతం, బాలానగర్, ఘట్‌కేసర్‌లలో 33శాతం చొప్పున తక్కువ వర్షపాతం నమోదైంది.

వివిధ చోట్ల వర్షం

శంషాబాద్/యాచారం/ఇబ్రహీంపట్నం/కేశంపేట: సోమవారం పలు చోట్ల వర్షం కురిసింది. శంషాబాద్‌లోని వివిధ బస్తీల్లో సాయంత్రం వర్షం కురిసింది. బస్తీల్లోని లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. కాముని చెరువులోకి నీరు చేరి నిండుకుండలా మారింది. యాచారం మండలం చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల, అయ్యవారిగూడ గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. పత్తి, మొక్కజొన్న, కంది, టమాట చేలకు మేలు కలిగిందని రైతులు చెబుతున్నారు. ముందు వేసిన పత్తిపంట పూతకు వచ్చింది. ఇబ్రహీంపట్నంలో సోమవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం చల్లబడింది. రోడ్లు జలమయమయ్యాయి. ఈ మధ్య కురిసిన వర్షాలతో భూగర్భ జలమట్టాలు కొంతమేర పెరిగాయి. కేశంపేట మండలంలో వర్షం దంచికొట్టింది. కేశంపేట, పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, తొమ్మిదిరేకుల, లింగంధన, నిర్దవెల్లి, లేమామిడి, సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, భైర్కాన్‌పల్లి, అల్వాల, కొత్తపేట, సంతాపూర్, వేములనర్వ, చింతకుంటపల్లి, కాకునూర్, బొదునంపల్లి, కొనాయపల్లి గ్రామాల్లో వర్షం కురిసింది. కేశంపేట సీఐ నరహరి వర్షం కురిసిన ప్రాంతాలకు పర్యవేక్షించారు.



అల్వాల బ్రిడ్జిపై నుంచి పారుతున్న వరద



కేశంపేటలో కురుస్తున్న వర్షం



శంషాబాద్ మధురానగర్ బస్తీలో కురుస్తున్న వర్షం

మహాధర్నాకు బీసీలంతా తరలాలి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ

ఆమనగల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ డిమాండ్ చేశారు. ఆమనగల్లు మార్కెట్‌యార్డ్‌లో సోమవారం మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు జగన్, మానయ్య, మండ్లి రాములుతో కలిసి మాట్లాడారు. బీసీ బిల్లు ఆమోదం కోసం ఈ నెల 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే మహాధర్నాకు బీసీలంతా కదిలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ యువజన తాలూకా అధ్యక్షుడు దళపతిగౌడ్, నాయకులు వస్పుల శ్రీశైలం, వస్పుల శ్రీకాంత్, కృష్ణానాయక్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఖాదర్‌ఖాద్రి, వెంకట్‌రెడ్డి, పర్వతాలు, విజయ్, మల్లేశ్‌నాయక్, ఫరీద్, నాజర్, అలీం, శ్రీను పాల్గొన్నారు.

పింఛన్ల పెంపు కోసం కదంతొక్కిన బీజేపీ

- కడ్తాలలో భారీ నిరసన ర్యాలీ
- పాల్గొన్న మాజీ ఎంపీ రాములు, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి



నిరసన ర్యాలీలో మాజీ ఎంపీ రాములు, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి, పింఛన్‌దారులు

కడ్తాల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ల పెంపు, కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీల అమలుకై పింఛన్‌దారులతో కలిసి బీజేపీ నాయకులు కదంతొక్కారు. నిరసన ర్యాలీ చేపట్టారు. బీజేపీ కడ్తాల్ మండల అధ్యక్షుడు దోనాదుల మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పింఛన్‌దారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరయ్యారు. చెన్నకేశవ ఆలయం నుంచి తహసీల్దార్ ఆఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ ముంతాజ్‌కు అందజేశారు. ధర్నాలో రాములు, ఆచారి మాట్లాడుతూ.. గ్యారంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను వంచిస్తోందని మండిపడ్డారు. ఓట్ల కోసం దివ్యాంగుల పింఛన్ రూ.6వేలకు, ఇతర అన్ని రకాల సామాజిక పింఛన్లను రూ.4వేలకు పెంచుతానని చెప్పి ఎన్నికల్లో ఓట్లేయించుకొని 20నెలలైతున్నా అమలుచేయకపోవడం మోసగించడమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.20వేల కోట్ల పింఛన్ సొమ్మును పక్కదారి పట్టించిందని ఆరోపించారు. ప్రతీ పేద మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, మాజీ ఎంపీపీ వీరయ్య, గిరిజనమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిలాల్‌నాయక్, జిల్లా, మండల నాయకులు రాందాస్‌నాయక్, రెడ్యానాయక్, శ్రీశైలం గౌడ్, శంకర్, గోరటి నర్సింహ, భగీరథ్, రవీందర్‌రెడ్డి, బక్కి కుమార్, యాదగిరి, మన్య, వెంకటేశ్, నరేశ్‌గౌడ్, విక్రమ్, రాములు, సాయిలుగౌడ్, ప్రేమ్, పవన్‌రెడ్డి, సందీప్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


కోర్టుకెళ్లారని నోటీసులు!

- బల్దియా అధికారుల కన్నెర్ర
- 16ఏళ్ల కింద నిర్మాణానికి షోకాజ్ జారీ

తాండూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ లెక్చరర్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ విజయదేవి తన ప్లాటు నుంచి మురుగు నీటి కాల్వను తవ్వారని హైకోర్టును ఆశ్రయించడంతో తాండూరు బల్దియా అధికారులు కన్నెర్రజేశారు. అదే స్థలంలో అన్ని అనుమతులతో 16ఏళ్ల క్రితం నిర్మించిన సింధూ డిగ్రీ కళాశాల భవనం అక్రమ నిర్మాణమంటూ తాజాగా నోటీసు జారీ చేశారు. ఇప్పటి వరకు సదరు భవనానికి ఆస్తిపన్ను తీసుకుంటున్నారు. తమపైనే కోర్టుకు వెళ్లారనే అక్కసుతో మున్సిపల్ అధికారులు నోటీసులిచ్చారని, అక్రమ నిర్మాణమంటూ పేర్కొనడం చర్చనీయాంశమైంది. అధికారులు మాత్రం ఈ నెల 2న కమిషనర్ సంతకంతో కూడిన నోటీసులో సర్వే నంబరు 139, 140లలో భవన నిర్మాణం అక్రమం అని, మున్సిపల్ యాక్టు 2019 ప్రకారం చర్యలుంటాయని పేర్కొన్నారు. అయితే ఈ భవనాన్ని 2019 మున్సిపల్ యాక్టు రాక ముందే నిర్మించింది. టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులిచ్చారు. ఈ భవనంపై ఎలాంటి ఫిర్యాదులు లేకున్నా 16ఏళ్ల క్రితం కట్టిన నిర్మాణం అక్రమం తాజా నోటీసులో పేర్కొన్నారు. ఏడు రోజుల్లో భవనానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు సమర్పించాలని సెక్షన్ 178 ప్రకారం షోకాజ్ నోటీసును జారీ చేశారు. ముందస్తు వివరాలు కోరకుండానే కమిషనర్ నోటీసు ఇవ్వడం సరికాదని, వేధింపుల్లో భాగంగానే నోటీసిచ్చారని విజయదేవి ఆరోపిస్తున్నారు.



16ఏళ్ల క్రితం నిర్మించిన భవనం



OFFICE OF THE MUNICIPAL COUNCIL :: TANDUR MUNICIPALITY
VIKARABAD DISTRICT

SHOW CAUSE NOTICE ISSUED UNDER SECTION 178 TELANGANA MUNICIPALITIES ACT 2019

P.O.No. 11 /UC/TP/TAND/2025. Date : 02/08/2025.

Sub: - Tandur Municipality - Town Planning Section - un authorisedly constructed a building consisting of Cellar + 2 Upper Floors in Sy No. 139 & 140, Patha Kunta, Tandur Village, Vikarabad Dist - Show Cause Notice Issued - Regarding.

<<<<>>>>

With reference to the subject cited above, it has come to the notice of the undersigned that Smt. S. Vijaya Devi, W/o V. Ranga Rao, has constructed a building consisting of Cellar + 2 Upper Floors and running a school in the name and style of Sindhu Degree College in Plot Nos. 41, 42, 51 & 52 situated in Survey Nos. 139 & 140, Pathakunta, Tandur Village, Vikarabad District which is violation of municipal act 2019 and building bye laws.

Details of construction.
You are unauthorisedly constructed building consisting of Cellar + 2 Upper Floors and doing business in the name and style of Sindhu Degree College at Tandur Village, Vikarabad District Dist.

Therefore, you are hereby directed to submit the sanctioned building permission documents, ownership documents and other relevant documents within 7 days of receipt of this notice, for verification and taking further necessary action, failing which further action will be taken as the provisions of the Telangana Municipalities Act, 2019.

COMMISSIONER
TANDUR MUNICIPALITY

మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన నోటీసు

కేశవగూడలో ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

- తొలగిన రైతుల ఇబ్బందులు

షాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవగూడలో వారం రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక పంటలు, వరినారు, దుక్కులు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో సోమవారం అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. రైతుల సమస్యపై.. 'ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. ఎండుతున్న' పైర్లు శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వారం రోజులుగా పంటలు ఎండుతున్నాయని అధికారులకు చెప్పినా విన్పించుకోలేదని, దీంతో తమ గోడును ఆంధ్రజ్యోతితో వెల్లబోసుకున్నామని రైతులు తెలిపారు. ఎట్టకేలకు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను బింగించారన్నారు. తమ సమస్య పరిష్కారానికి కృషిచేసిన ఆంధ్రజ్యోతికి ఈ సందర్భంగా కేశవగూడ రైతులు ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

సహకార వ్యవస్థ బలోపేతం

ఒకే గొడుగు కిందికి వివిధ సొసైటీలు

- పాత పద్ధతిలో సంఘాల నిర్వహణ
- కొత్త బ్రాంచీల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్ర కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ వద్ద పెండింగ్



తాండూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, ఇతర సహకార రంగాల సంఘాల సభ్యులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సహకార వ్యవస్థలో మార్పులు చేపట్టనుంది. ప్రస్తుతం వేర్వేరుగా ఉన్న వివిధ సహకార సంఘాలను ఒకే సహకార వ్యవస్థలోకి తేవాలని భావిస్తోంది. పాత పద్ధతిలోనే సహకార సంఘ సభ్యులకు, రైతులకు సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, పశుసంవర్ధకశాఖ సొసైటీలు, చేపల పెంపకదారుల సంఘాలు వంటివన్నీ ప్రస్తుతం వేర్వేరు కార్యనిర్వహక వ్యవస్థతో పనిచేస్తున్నాయి. వీటన్నింటినీ ఒకే గొడుగు కిందికి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామం యూనిట్‌గా సంఘాలన్నింటినీ ఒకే సహకార వ్యవస్థలోకి తేనున్నారు.

అదనంగా బ్రాంచీలకు ప్రతిపాదనలు

తాండూరు నియోజకవర్గంలో బషీరాబాద్ మండలం కాశీంపూర్, పెద్దేముల్ మండలం మంబాపూర్, యాలాల మండలం లక్ష్మీనారాయపూర్‌లలో కొత్తగా సొసైటీ బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తారు. ఆర్థిక పరిస్థితి, సభ్యుల సంఖ్య, కార్యాలయాలు వంటి వాటిని పరిణములోకి తీసుకొని బ్రాంచీలను ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే దీనికి సంబంధించి డీపీఆర్(డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు)లను తయారు చేసి జిల్లా సహకార అధికారికి పంపగా కొత్త బ్రాంచీలను ఆమోదించారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉండే జాయింట్ వర్కింగ్ కమిటీ ఆమోదించి ప్రతిపాదనలను రాష్ట్ర కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్‌కు పంపారు. ఈ ప్రతిపాదన అక్కడ పెండింగ్‌లో ఉంది.

మరింత మెరుగ్గా సేవలు



ఉమ్మడి రంగారెడ్డి డీసీసీబీ పరిధిలో కొత్తగా బ్రాంచ్‌ల ఏర్పాటుతో వివిధ సొసైటీల సభ్యులకు మెరుగైన సేవలందించే వీలుంటుంది. కొత్తగా తొమ్మిది సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదించాం. వికారాబాద్ జిల్లాలో మంబాపూర్, కాశీంపూర్, లక్ష్మీనారాయణపూర్, అంగడి చిట్టెంపల్లి, రంగారెడ్డి జిల్లాలో హైతాబాద్, కందుకూర్, మంచాల, యాచారం, మేడ్చల్ జిల్లాలో శామీర్‌పేటల్లో సొసైటీ బ్రాంచ్‌లకు ప్రతిపాదించాం. అనుమతులు రావాల్సి ఉంది. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య సహకారంతో కొత్త బ్రాంచీలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర అధికారుల నుంచి అనుమతులొచ్చిన వెంటనే బ్రాంచీలను ప్రారంభిస్తాం.

- సంగెం రవీందర్‌గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్

ప్రతీ ఫిర్యాదును పరిష్కరిస్తాం



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ప్రతీ ఫిర్యాదును పరిష్కరిస్తామని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధించిన శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్బీఐ మేనేజర్ మాధవరావు

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

దోమ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): డిజిటల్ సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దోమ మండల ఎస్బీఐ మేనేజర్ మాదవరావు అన్నారు. దిర్సంపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన జన సురక్ష పరిపూర్ణ ప్రచార శిబిరంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌బీఐ ఖాతా కలిగిన 18 నుంచి 70 సంవత్సరాల్లోపు కలిగిన ప్రతీ ఒక్కరూ ప్రమాద బీమా చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు, వినియోగదారుల సేవా కేంద్రం సీఎస్‌పీ షాహీన్ బేగం, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికులకు బిల్లులు చెల్లించాలి

కందుకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు వెంటనే బిల్లులు చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ కోరారు. ఈ నెల 6న భోజన కార్మికులు వంట బంద్ చేసి నిరసన తెలుపనున్నందున సోమవారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలైనా భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఎనిమిది నెలల కోడిగుడ్ల బిల్లులు, మూడు నెలల కూరగాయిల బిల్లులు, మూడు నెలలు వేతనాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో కార్మికులు ప్రభావతి, శ్రీనివాస్, అశ్విని, అలివేలు, మంగమ్మ, లావణ్య, సుగుణ పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్, మహిళలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఘట్‌కేసర్‌లోని గట్టుమైసమ్మ దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న పూజారులు

వికారాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి సోమవారం పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వికారాబాద్ బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి భక్తులు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు నెల రోజుల పాటు వికారాబాద్ వీరశైవ సమాజం ఆధ్వర్యంలో నిత్యాన్నదానం చేస్తున్నారు.

ధారూరు: మండలంలోని నాగారం గ్రామ శివారులోని చెరువు కట్టపై సోమవారం గ్రామ దేవత మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. జిల్లా వాలీబాల్ అసోషియేషన్ చైర్మన్ జె.హన్మంత్‌రెడ్డి, స్థానిక నాయకులు నరోత్తంరెడ్డి, వీరేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ధారూరులోని వీరభద్రేశ్వర ఆలయంలోని పార్వతీ దేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు. శివలింగంకు అభిషేకంతో పాటు, గణపతి, సుబ్రమణేశ్వర, వీరభద్రేశ్వర స్వామి, నంది విగ్రహాలకు ప్రత్యేకపూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు అనంతరం వ్యాపారి కల్వ మహేందర్ భక్తులకు అన్నదాన వితరణ చేశారు.


ఘట్‌కేసర్ రూరల్: కొర్రెముల నీలకంఠస్వామి ఆలయంలో గణపతి హోమం


ధారూరు: ధారూరులో పార్వతీ దేవి సన్నిధిలో కుంకుమార్చనలో మహిళలు

తాండూరు: పట్టణంలో భవానీనగర్ లో రామలింగేశ్వర, భద్రేశ్వర స్వామి, పాత తాండూరు వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని శివాలయం, కోటేశ్వర దేవాలయం, చెరువెంటి ఈశ్వారాలయం, దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆలయ పూజారి మడపతి శశిధర్ భక్తులతో పూజలు నిర్వహించారు.

ఘట్‌కేసర్: గట్టుమైసమ్మ దేవాలయ 8వ వార్షికోత్సవ పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గణపతి హోమం, నవగ్రహ హోమం, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సహకార సంఘం మాజీ డైరెక్టర్ బొక్క ప్రభాకర్‌రెడ్డి బోనంతో నైవేద్యం సమర్పించారు. కందకట్ల చెన్నారెడ్డి సరిత దంపతులు హోమం నిర్వహించారు.

ఘట్‌కేసర్ రూరల్: పోచారం మున్సిపాలిటీ, కొర్రెములలోని శ్రీమహకాంళి సమేత బ్రహ్మసూత్ర నీలకంఠ స్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం గణపతి హోమం నిరహించారు. కొర్రెముల మాజీ సర్పంచ్‌లు ఒరుగంటి కవిత, వెంకటేష్‌గౌడ్‌లతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

కాణిపాకంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

ఏపీలోని చిత్తూరు జిల్లా కాణిపాకంలోని స్వయంభు వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, అరుణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని ఎమ్మెల్యే దంపతులు అరుణాచలంలో గిరిప్రదక్షిణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.



క్రైం కార్నర్

లారీ ఢీకొని వ్యక్తి మృతి


వెంకటేష్(ఫైల్)

కీసర రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన అల్లాదుర్గం వెంకటేశ్(56) కీసర వెంకటసాయి థియేటర్ సమీపంలో సోమవారం ఉదయం బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని జగద్గిరిగుట్టకు చెందిన దూదిమెట్ల మల్లికార్జున్‌రెడ్డి(63) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో గూడ్స్‌రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లోకల్ పైలట్ ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వేపోలీసులు మృతుడి ఆధార్‌కార్డ్ పరిశీలించగా మల్లికార్జున్‌రెడ్డిగా గుర్తించి అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ముగ్గురు కూతుళ్లు ఉండగా, ఇద్దరి కూతుళ్ల వివాహం చేశాడు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం


రాధ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ, చౌదరిగూడ, వెంకటాద్రిటౌన్‌షిప్‌నకు చెందిన హదనవహలి రాధ(58) ఇంట్లో కుటుంబసభ్యులు లేని సమయంలో ఈనెల 3వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకూ తిరిగిరాలేదు. ఆమె కుటుంబసభ్యులు తెలిసిన వారిని, బంధువులను, స్నేహితులను విచారించినా ఫలితం లేదు. దీంతో ఆమె కూతురు పోచారం ఐటీ కారిడార్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోచారం పరిధిలో వ్యక్తి..


గుండగోని కుమార్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్, తెనుగూడెంకు చెందిన గుండగోని కుమార్(57) కొద్దిరోజులుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఈనెల 2న ఇంట్లో కుటుంబసభ్యులు అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం, బాచారంకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన కుమార్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి కుటుంబసభ్యులు పరిసరాలను వెతికి, తెలిసిన వారిని విచారించినా ఫలితం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోచారం పోలీస్‌స్టేషన్‌లో గుర్తుతెలియని బాలుడు



పోలీసుల సంరక్షణలో బాలుడు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని బాలున్ని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అక్కున చేర్చుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడ, అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో బాలుడు(5) ఉన్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వివరాలు అడుగగా సూరారం గ్రామం అని చెప్పుతున్నాడని, మిగతా విషయాలు ఏమీ చెప్పడం లేదని తెలిపారు. దీంతో బాలున్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 8712661718 నంబర్‌ను సంప్రదించాలని సీఐ కోరారు.

డాక్టరేట్ ప్రదానం


పీహెచ్‌డీ పట్టాను అందుకుంటున్న ధనలక్ష్మి

పరిగి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణానికి చెందిన ధనలక్ష్మికి డాక్టరేట్ వరించింది. పరిగి మునిసిపల్ పరిధిలోని శ్రీనివాసకాలనీకి చెందిన ధనలక్ష్మి వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలు. తెలుగు సాహిత్యంలో లక్ష్మీస్తుతి అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి ప్రొఫెసర్ సాగికమలకరశర్మ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. 'తెలుగు సాహిత్యంలో లక్ష్మీస్తుతి' అనే అంశంపై అధ్యయనం చేసి నివేదికను సమర్పించారు. ధనలక్ష్మీశ్రీనివాస్ నివేదికను పరిశీలించిన యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టాను అందజేసింది. ఈ మేరకు ప్రొఫెసర్ సాగి కమలకరశర్మ చేతుల మీదుగా ధనలక్ష్మి డాక్టరేట్‌ను స్వీకరించారు. ధనలక్ష్మీభర్త ఎం.శ్రీనివాస్ వృత్తిరీత్యా న్యాయవాది. ఈ సందర్భంగా ధనలక్ష్మీ దంపతులను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు.

చంద్రకల్ వాసికి..


డాక్టరేట్ పట్టాతో సరిత

దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండలంలోని చంద్రకల్ గ్రామానికి చెందిన దేవయ్య, శకుంతల దంపతుల కుమార్తె సరిత ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీలో ఆదివారం డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయంలో నేల నాణ్యత పెంపుపై అసిస్టెంట్ ప్రొఫెసర్ జయశ్రీ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు తెలిపారు. డాక్టరేట్ పట్టాను పొందిన ఆమెను కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి


జంగయ్యను సన్మానిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వికారాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి జీవితంలో పదవీ విమరణ తప్పని సరి అని మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ అన్నారు. సోమవారం మునిసపల్ కార్యాలయంలో పదవి విమరణ పొందుతున్న సీనియర్ అసిస్టెంట్ జంగయ్య పదవీ విమరణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించి మునిసిపల్ అధికారులు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికాయులు విఠల్, రాకేష్‌రెడ్డి, ఏసుదాసు, వెంకటేశ్ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం


నరేశ్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

కులకచర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సీనియర్ అసిసోసియేషన్ టెన్నిస్ క్రికెట్ బాల్ పోటీల్లో పాల్గొన్న మండలంలోని ముజాహిద్‌పూర్ ఆదర్శ ఉన్నతపాఠశాల విద్యార్థి నరేశ్‌ను సన్మానించారు. ఆదర్శ పాఠశాలలో నరేశ్ పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 1 నుంచి 3 వరకు చెన్నయ్ రామకృష్ణ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి టెన్నిస్ క్రికెట్ బాల్‌పోటీల్లో పాల్గొన్నాడు. విద్యార్థి నరేశ్‌ను సోమవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ జ్యోతి ఎప్సీబా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాజరుపై నజర్

(ఐదో పేజీ తరువాయి)

అక్రమ పద్ధతులకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శులతో పాటు 9 మండలాల మండల పంచాయతీ అధికారులకు కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ అయిన వారిలో బషీరాబాద్, చౌడాపూర్, ధారూరు, దుద్యాల్, కొడంగల్, మోమిన్‌పేట్, పరిగి, పెద్దేముల్, వికారాబాద్ మండలాల అధికారులు ఉన్నట్లు తెలిసింది.

పంచాయతీల్లో పడకేసిన పాలన

ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పంచాయతీల్లో ప్రగతి కుంటుపడింది. పాలక వర్గాల పదవీకాలం ముగిసిన తర్వాత పంచాయతీలకు నియమించిన ప్రత్యేకాధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడు, నాలుగు పంచాయతీలకు ఒక మండల స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించారు. అయితే వారు తమకు కేటాయించిన పంచాయతీలను నెలకు ఒకటి, రెండు పర్యాయాలు కూడా సందర్శించడం లేదనే విమర్శలు ఉన్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారి పర్యటన ఉంటేనే అధికారులు గ్రామాల బాట పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీరు, అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు వంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా వారు పర్యవేక్షించి పంచాయతీ కార్యదర్శులకు తగిన సూచనలు చేయాలి. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులతో చర్చించి అవసరమైన నియంత్రణ, నివారణ చర్యలు ముందుగానే చేపట్టేలా సూచనలు చేయాల్సి ఉంటుంది. వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాల్సిన కార్యదర్శులు, పర్యవేక్షించాల్సిన ఎంపీవోలు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం పట్ల ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన కీలక సమయంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని వారు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడం కారణంగానే పంచాయతీ కార్యదర్శులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిగి సెర్ప్ ఏపీయంగా రాజు


పాత ఏపీఎంనుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న రాజు

పరిగి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పరిగి సెర్ప్ ఏపీఎం రాజు బాధ్యతలు స్వీకరించారు. పరిగి ఏపీఎంగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై కులకచర్లకు వెళ్లారు. మోమిన్‌పేట్ ఏపీఎంగా పని చేఏస్తున్న రాజు బదిలీపై పరిగికి వచ్చారు. ఈ సందర్భంగా పాత, కొత్త ఏపీఎంలను ఘనంగా సన్మానించారు.

కులకచర్ల ఏపీయంగా శ్రీనివాస్‌రెడ్డి



కులకచర్ల: కులకచర్ల ఏపీయంగా శ్రీనివాస్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఏపీయం శోభ దోమకు బదిలీపై వెళ్లారు. పరిగిలో పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఫర్నిచర్ విరాళం


నర్సింగరావును సన్మానిస్తున్న కమిషనర్ పవన్‌కుమార్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి

మూడుచింతలపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జగ్గంగూడ పరిధిలోని పల్లె దవాఖానాకు విశ్వ కంపెనీ యజమాని ఎర్ర నర్సింగరావు సోమవారం ఫర్నిచర్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ మాజీసర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి విశ్వ కంపెనీ యజమాని నర్సింగరావును ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్ పల్లె దవాఖానాలో ఫార్మసీ, ల్యాబ్ టెస్ట్‌ను పరిశీలించారు. అనంతరం మొక్కలు నాటారు.

బిడ్డకు తల్లిపాలే శ్రీరామ రక్ష


మేడ్చల్ టౌన్: మాట్లాడుతున్న మెడిసిటీ కళాశాల డైరెక్టర్ గీత

మేడ్చల్ టౌన్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): బిడ్డకు తల్లి పాలే శ్రీరామరక్ష అని మెడిసిటీ వైద్యకళాశాల డైరెక్టర్ గీత తెలిపారు. మేడ్చల్, మెడిసిటీ ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల(బిడ్డకు బ్రెస్ట్ ఫీడింగ్)పై అవగాహణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ కల్పన పాల్గొన్నారు.

చౌడాపూర్: మండలంలోని వీరాపూర్, చౌడాపూర్ గ్రామాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాల విశిష్టతపై బాలింతలు, గర్భిణి మహిళలకు అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వహీదాఖాతున్, ఎంపీడీవో సోమలింగం, రమేష్, పంచాయతీ కార్యదర్శి రాజీరెడ్డి, అంజమ్మ, చంద్రకాంత్ పాల్గొన్నారు.

కొడంగల్: పర్సాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ టీచర్లు తల్లిపాల విశిష్టతను వివరించారు.

దుద్యాల: ఆలేడ్ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు ఎంపీవో సత్యనారాయణ ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేశ్, అంగన్‌వాడీ టీచర్ భారతిరెడ్డి, గ్రామస్తులు శ్రీధర్‌గౌడ్, వెంకటేశ్, నర్సింహులుగౌడ్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో ఆరోగ్యమని క్లస్టర్ సూపర్‌వైజర్ ప్రభ అన్నారు. పర్సాపూర్ గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు.

కులకచర్ల: కామునిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ సోమవారం తల్లిపాల వారోత్సవాలు, గ్రామ పోషణ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకట్, ఏఎన్ఎం జంగమ్మ, అంగన్‌వాడీ టీచర్ పండరీబాయి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఆదరించండి


పూడూరు: కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

పరిగి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. పరిగి మున్సిపల్ పరిధిలోని 216 బూత్‌లో సోమవారం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాముయాదవ్, పెంటయ్యగుప్త ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూడూరు: మార్పు కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని ఆదరించండని బీజేపీ పూడూరు మండల అధ్యక్షుడు రాఘవేందర్ ప్రజలను కోరారు. మన్నెగూడలో సోమవారం బీజేపీ నాయకులతో కలిసి కరపత్రాలను అందజేశారు.

కులకచర్ల: మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ సోమవారం ఘనపూర్, అంతారం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ధారూరు: అంతారం, మోమిన్‌కలాన్, మోమిన్‌కుర్దు, నాగారం గ్రామాల్లో ఇంటింటికి బీజేపీ నాయకులు కార్యక్రమాన్ని సోమవారం ఆపార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి, వి.నందు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం నాగారంలో నిర్వహించిన కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో వారు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


తాండూరు: మాట్లాడుతున్న మణిపాల్

తాండూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాండూరు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఎస్.మణిపాల్ సూచించారు. పాత తాండూరు నెం. 2 హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య పాల్గొన్నారు.

పరిగి: తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఇంటి ముందుకి వచ్చే చెత్తబండిలోనే వేయాలని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య సూచించారు. మున్సిపల్ పరిధిలోని ఏడో వార్డులోని గంగపుత్రకాలనీలో సోమవారం తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథం, మెప్మాసీసీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్ష పదవి ఎవరికో?

కులకచర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎవరిని ఎంపిక చేస్తారోనని మండలంలోని చర్చ జరుగుతోంది. ప్రస్తుతం పార్టీ మండల అధ్యక్షుడిగా ఉన్న శేరి రాంరెడ్డి కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ మండల అధ్యక్షుడి ఎంపిక అనివార్యంగా మారింది. ఇందుకు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి కార్యకర్తల అభిప్రాయం సేకరిస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు తిరుమలాపూర్ గ్రామానికి చెందిన మహేశ్వరం రాములుగౌడ్, మాజీ అధ్యక్షుడు ముజాహిద్‌పూర్ సారా శ్రీనివాస్, అంతారం బోయిని మొగులయ్య పేర్లు పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది. మహేశ్వరం రాములుగౌడ్‌కు గ్రామంలో మంచి పట్టుంది. ప్రస్తుతం గౌడ సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. కార్యకర్తలు కూడా ఆయనకే మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.

పేదల సంక్షేమానికి పెద్దపీట


కొత్తరేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న ధారాసింగ్

పెద్దేముల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్ అన్నారు. పెద్దేముల్ గ్రామానికి మంజూరైన 151 కొత్త రేషన్ కార్డులను సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు గోపాల్, మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ రియాజ్, డీసీసీ ఉపాధ్యక్షుడు నల్లఎల్లారెడ్డి, నాయకులు జితేందర్ రెడ్డి, రవిశంకర్, ప్రవీణ్‌కుమార్, శోభారాణి, విద్యాసాగర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని బెల్కటూర్ గ్రామంలో ఇటీవల ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. బెల్కటూర్‌లో పంచాయతీ కార్యదర్శి పార్వతమ్మ ఆధ్వర్యంలో సోమవారం గ్రామానికి మంజూరైన 16 రేషన్ కార్డులను గ్రామ నాయకులు నారాయణరెడ్డితో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన నర్సింహులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

స్వాధ్యాయ పరివార శతాబ్ది ఉత్సవాలు

మేడ్చల్ టౌన్: మేడ్చల్‌లోని జంగయ్య కల్యాణ మండపంలో సోమవారం స్వాధ్యాయ పరివార శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

ఉపాధిహామీ రాష్ట్ర కమిటీ సభ్యుడికి సన్మానం

బొంరాస్‌పేట్: మండలానికి చెందిన నర్సింహులుగౌడ్ ఉపాధిహామీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎంపిక కావడంతో సోమవారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అక్షయపాత్ర ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం

చౌడాపూర్: మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం నుంచి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో మందిపాల్ పంచాయతీ కార్యదర్శి స్వరూప, పాఠశాల చైర్‌పర్సన్ యాదమ్మ, ఉపాధ్యాయులు నందు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇప్పయిపల్లి గ్రామ కమిటీ

కులకచర్ల: ఇప్పయిపల్లి గ్రామ కాంగ్రెస్ నూతన కమిటీని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వడ్డె వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా బర్ల నర్సింహులు, యూత్ అధ్యక్షుడిగా ఎర్రం రాజు, ఉపాధ్యక్షుడిగా యాదయ్య ఎంపిక య్యారు.

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

పూడూరు: పీఆర్టీయూటీఎస్ పూడూరు మండల శాఖ ఆధ్వర్యంలో క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పూడూరులోని ఉన్నత, ప్రాథమిక పాఠశాల, పెద్ద ఉమ్మెంతల్, సోమన్‌గుర్తి తదిత ర పాఠశాలల్లో సోమవారం ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందజేశారు.

పిచ్చి మొక్కల తొలగింపు

నవాబుపేట: మండల కేంద్రంలో గల అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో పిచ్చి మొక్కలను పులుమామిడి గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి సోమవారం చదును చేయించారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి

కోట్‌పల్లి: మండల కేంద్రంలో సోమవారం భవిత సెంటర్‌లో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి నిర్వహించినట్లు మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరాపి స్పెషల్‌ఎడ్యుకేషన్ టీచర్ శ్రీదేవి, డాక్టర్ శ్రీకాంత్, ఐఈఆర్‌పీ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే ఉపేక్షించేదిలేదు

మోమిన్‌పేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే ఉపేక్షించేది లేదని ఎంపీవో యాదగిరి అన్నారు. మండలంలోని కేసారంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం బంజరు దొడ్డిని ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి రవి, గ్రామస్థులతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో యాదగిరి